వడగళ్లు.. కడగండ్లు

- ముంచిన అకాల వర్షం
- దెబ్బతిన్న పంటలు
- పరిశీలించిన అధికారులు

ముప్పాళ్ళ/అచ్చంపేట/బెల్లంకొండ/రాజుపాలెం : సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో వడగళ్ల వాన కడగండ్లు మిగిల్చింది. ముప్పాళ్ల మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కూడా వడగళ్ల వాన కురిసింది. ముప్పాళ్ళ, గోళ్ళపాడు, కుందురువారిపాలెం, తురకపాలెం గ్రామాల్లో మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. ఇప్పటికే గత రెండురోజులుగా ఈదురుగాలలతో కూడిన చిరుజల్లులు కురుస్తుండడంతో మొక్కజొన్న పంట నేలవాలగా, కల్లాల్లో ఉన్న మిరపకాయలు రంగు మారే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోసిన మిరప పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు.



తాళ్లచెరువులో నేలవాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో సుగుణాబేగం



ముప్పాళ్లలో కురుస్తున్న వడగళ్ల వాన

దెబ్బతిన్న పంటల పరిశీలన

వర్షాలకు నేలవాలిన పంటలను వ్యవసాయాధికారులు సోమవారం పరిశీలించారు. అక్కడక్కడ పంటలు నేలవాలినట్టు గుర్తించారు. పంట నష్టంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏఓ అరుణ తెలిపారు.

- అచ్చంపేట మండలంలో అకాల వర్షాలకు మొక్కజొన్న పంట ముంపునకు గురైంది. దెబ్బతిన్న చేలను ఏవో షేక్ సుగుణాబేగం సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అచ్చంపేట, తాళ్లచెరువు, కోనూరు, కస్తల, చామర్రు, చిగురుపాడు తదితర గ్రామాలలో సుమారుగా 200 ఎకరాలలో మొక్కజొన్న పంటలు వేసినట్లు వెల్లడించారు. వడగళ్ల వానకు మొక్క విరిగి నేలవాలిందని వివరించారు. ప్రస్తుతం మొక్కకు రెండు, మూడు కండెలు ఉన్నాయని, అవి పాలుపోసుకునే దశలో ఉన్నట్లు చెప్పారు. మరో నెల రోజులలో కోతకు వచ్చే పరిస్థితులున్నాయని పేర్కొన్నారు. వాన వల్ల తీవ్ర పంట నష్టం వాటిల్లిందని అభిప్రాయపడ్డారు.
- బెల్లంకొండ మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ, ఉద్యానశాఖాధికారులు సోమవారం పరిశీలించారు. పాపాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం, మాచాయపాలెం గ్రామాలలో బొప్పాయి, మునగ, టమాటా, మొక్కజొన్న, నువ్వుల పంట పొలాలను మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య, ఉద్యానశాఖాధికారి శ్రీనివాసరావు పరిశీలించారు. కార్యక్రమంలో పాపాయపాలెం సర్పంచ్ చిమటా మాధవి, సైదయ్య, ఎంపీటీసీ మర్రి శ్రీనివాసరెడ్డి, వీఆర్వో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.
- రాజుపాలెం మండలంలో దెబ్బతిన్న పొలాలను వ్యవసాయాధికారులు, ఉద్యానశాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. ఉప్పలపాడు, నెమలిపురి, ఇనిమెట్ల గ్రామాలలో వరి పొలాలను వ్యవసాయాధికారి వీరయ్య పరిశీలించి రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరి పంట నష్టంపై నివేదిక తయారు చేశారు. ఉద్యానశాఖ అధికారి నవీన్ అంచులవారిపాలెం, అనుపాలెంలోని మామిడి, బొప్పాయి, అరటి తోటలను పరిశీలించారు. మామిడి తోటలో చెట్లు పూర్తిగా నేలమట్టం కావడంతో ఎకరానికి ఎన్నిచెట్లు దెబ్బతిన్నాయో నమోదు చేసుకున్నారు.

మిరప రైతులు జాగ్రత్తలు పాటించాలి

సత్తెనపల్లి: అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మిరప రైతులు జాగ్రత్తలు పాటించాలని సత్తెనపల్లి ఉద్యానవన శాఖ అధికారిణి సీహెచ్ జనని చెప్పారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మిర్చి రైతులు జాగ్రత్తలు పాటిస్తే పంటలను రక్షించుకోవచ్చని వివరించారు. ప్రస్తుతం మిరప పంట కోత (రెండవ, మూడవ కోత) కల్లాలలో ఎండుతున్న దశలో ఉందన్నారు. కల్లాలలో ఉన్న కాయలు తడవకుండా టార్పాలిన్ పట్టాలతో కప్పి జాగ్రత్త చేసుకోవాలని, అధిక తేమ వల్ల పంట మీద ఉన్న కాయలకు కాయ కుళ్ళు రావడానికి అవకాశం ఉందన్నారు. కాబట్టి ముందు జాగ్రత్తగా మాంకోజెబ్ (లీటరుకి 2.5 గ్రాములు) లేదా క్లోరోథలోనీల్ (లీటరుకి 2 గ్రాములు) లేదా థయోఫినైట్ మిథైల్ (లీటరుకి 2 గ్రాములు) పిచికారీ చేయాలని సూచించారు. తెగులు ఉధృతి నివారణకు డైఫిన్ కొనాజోల్ 0.5 ఎమ్ఎల్ లేదా ప్రొపికొనాజోల్ 1 ఎమ్ఎల్ పిచికారీ చేసిన తరువాత కాబ్రియోటాప్ లీటరుకు 3 గ్రాములు లేదా అజాక్సిస్ట్రోబిన్ 1 ఎమ్ఎల్ చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. సూక్ష్మ పోషక మిశ్రమం (ఎగ్రో మిన్ మాక్స్) లీటరుకు 2.5 గ్రాములు చొప్పున స్థూల పోషక మిశ్రమం (13-0-45) లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. కోత కోసి ఎండబెట్టేటప్పుడు కాయకుళ్ళు ఆశించిన కాయలను వేరు చేసి విడివిడిగా ఆరబెట్టుకోవాలని పేర్కొన్నారు.





రాజుపాలెం మండలంలో దెబ్బతిన్న పొలాలను పరిశీలించిన అధికారులు ; పాపాయపాలెంలో దెబ్బతిన్న బొప్పాయి తోటలను పరిశీలిస్తున్న అధికారులు

174 మందికి వైద్యసేవలు



సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సోమవారం సేవలందించారు. వైద్యాధికారిణి డాక్టర్ యు.ఎస్.ఎల్.కవిత 174 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచంలోనే ఉన్న రోగుల ఇంటికి వెళ్లి వైద్య సలహాలు, సూచనలు అందించారు. గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ఆరోగ్యం గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ జె.సంపూర్ణ దేవి, ఎమ్ఎల్‌హెచ్‌పీ ఏ.గణేష్, ఏఎన్ఎంలు కె.విజయ రాణి, డి.జ్యోతి, ఆశా కార్యకర్తలు టి.కమల కుమారి, డి.శ్రీదేవి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి వంట సామగ్రి వితరణ



అచ్చంపేట: చెరుకుంపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి కావలసిన వంట సామగ్రిని స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్ఎం ఎనోష్‌బాబుకు సోమవారం అందజేశారు. రెండు పెద్ద వంట పాత్రలు, 50 మంది విద్యార్థులకు సరిపడా భోజనం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసినట్లు సంస్థ కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.12వేల వరకు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతగుంట్ల అనూరాధ, హనుమంతరెడ్డి దంపతులు, గ్రామాభివృద్ధి సంఘ అధ్యక్షులు తుమ్మా శౌర్రెడ్డి, అభివృద్ధి సంఘ సభ్యులు చింతగుంట్ల సత్యనారాయణరెడ్డి, కందుల దశరథరామయ్య, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ సుంకర శేషమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్ష నష్టాలపై నివేదిక

ఉద్యానవనశాఖాధికారి దాసరి నవీన్‌కుమార్



నకరికల్లు: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం చెల్లింపు కోసం ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని ఉద్యానవనశాఖాధికారి దాసరి నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని చేజర్ల, కుంకలగుంట గ్రామాలలో ఈదురుగాలు, వర్షానికి నేలవాలిన అరటితోటలను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కుంకలగుంట గ్రామంలోని దమ్మువళం మాధవి 3 ఎకరాలు, మూలె బ్రహ్మారెడ్డి ఎకరం, బాడిశ నర్సయ్య ఎకరం, చేజర్ల గ్రామంలో ఎం.దశరథరామిరెడ్డి 2 ఎకరాల పంటను నష్టపోయినట్టు వివరించారు. రైతుల పేర్లు, నష్టం వాటిల్లిన పంట వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

గ్రామ కంఠం భూముల రీసర్వే



నకరికల్లు: గ్రామకంఠాల పరిధిలో స్వమిత్వ సర్వే నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎస్.సురేష్ తెలిపారు. గ్రామకంఠం పరిధిలోని గృహాలు, ఖాళీస్థలాలు, ప్రభుత్వ భవనాలు, ఆలయాల భూముల సర్వే గురించి ఆయా శాఖల సిబ్బందితో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా గ్రామకంఠం సర్వే నిర్వహిస్తున్నట్టు వివరించారు. గృహ, ఖాళీస్థలాల యజమానులు వీఆర్వో, కార్యదర్శి, గ్రామస్థాయి ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు హక్కుపత్రాలు అందజేసి సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ గిరిధర్, ఆర్ఐ పురుషోత్తం పాల్గొన్నారు.

కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన



పెదకూరపాడు: కిశోర బాలికలు పౌష్టికాహారం, ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని పెదకూరపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మున్ని చెప్పారు. పెదకూరపాడులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో పోషణ పట్వాడ పక్షోత్సవాలను సోమవారం ప్రారంభించారు. విద్యార్థులకు పౌష్టికాహార ఆవశ్యకత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. యుక్త వయస్సులో ఉన్న బాలికలు బలవర్ధక ఆహారం తీసుకుంటే ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సామ్రాజ్యం, గోగులపాటి కుమారి పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఈపూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో 4 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు మండల కో-ఆర్డినేటర్ యు.రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసుకున్న యువతీ యువకులకు ఉచిత శిక్షణ, వసతి కల్పించి అనంతరం ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువత విద్యార్హత సర్టిఫికెట్లు నకలు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లతో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలు 83743 60175 నంబరులో తెలుసుకోవచ్చన్నారు.

డాక్టర్ పీవీ సుబ్బారావుకు ఉగాది పురస్కారం



చిలకలూరిపేట: పట్టణానికి చెందిన ప్రముఖ సాహితీ విమర్శకుడు డాక్టర్ పీవీ సుబ్బారావు జిల్లా స్థాయి ఉగాది పురస్కారం అందుకోనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సమాచారం అందినట్లు డాక్టర్ పీవీ సుబ్బారావు తెలిపారు. గతంలో ఆయన అధికార భాష సంఘం సభ్యుడుగా వ్యవహరించారు. గతంలోనూ రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్నారు.

కాకతీయ అన్నదాన సత్రానికి రూ.25 వేలు విరాళం

శావల్యాపురం: బొందిలిపాలెం గ్రామంలో వేంచేసిఉన్న అడవి పేరంటాళ్లమ్మ తిరునాళ్లను పురస్కరించుకొని అమ్మవారి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కాకతీయ అన్నదాన సత్రానికి దాతలు విరాళాలు అందజేస్తున్నట్లు వ్యవస్థాపక కమిటీ సభ్యుడు నాగుబడి వీరనారాయణ సోమవారం తెలిపారు. చినకంచర్ల గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు (పెదబాబు), అరుణ దంపతులు రూ.25,116 చెక్కు రూపంలో అందజేశారని ఆయన పేర్కొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు

ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రావు

సత్తెనపల్లి: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఈటిపోగు వెంకట్రావు చెప్పారు. న్యాయ సేవాధికార కమిటీ ఆదేశాల మేరకు సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయ సేవా అధికార కమిటీ చైర్మన్ డి.నాగవెంకటలక్ష్మి సూచనల మేరకు సోమవారం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలను న్యాయ సేవాధికారి కమిటీ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు సందర్శించారు. సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రావు వైద్యశాలలోని అన్ని విభాగాలను వారికి చూపించారు. అనంతరం డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ ఇటీవల ఓపీ గణనీయంగా పెరిగిందని, 'సీ' గ్రేడ్ నుంచి 'ఏ' గ్రేడ్‌కు ఈ ఆస్పత్రి వచ్చిందని వివరించారు. ఆస్పత్రిలో అవసరం మేరకు అదనపు గదుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు.



న్యాయసేవాధికార కమిటీకి వివరాలు వెల్లడిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటట్రావు

కొన్ని సమస్యలు గుర్తించాం

న్యాయసేవాధికార కమిటీ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు మాట్లాడుతూ వైద్యశాలను 50 నుంచి 100 పడకలుగా మార్చారని, ఆ మేరకు వైద్యుల కొరత తీరినా, అవసరమైన గదుల నిర్మాణం నత్తనడకన నడుస్తున్నట్లు, ఉన్న గదుల్లోనే సర్దుకోవాల్సి రావడం అటు వైద్యులు, సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు గుర్తించామని పేర్కొన్నారు. ముఖ్యమైన వైద్య పరికరాలు లేక పోవడంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదని, 50 పడకలు ఉన్నప్పుడు ఉన్న సెక్యూరిటీ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది 100 పడకలు అయిన తర్వాత కూడా పెరగకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నట్లు వివరించారు. ప్రధానంగా పార్కింగ్‌స్థల కొరత ఉందని, అత్యవసరంగా వచ్చే అంబులెన్స్‌ల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వెల్లడించారు. రోగుల సహాయకులకు వేచి ఉండే హాలు లేదని వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాస రావు, పారా లీగల్ వాలంటీర్లు షేక్ సుభాని, షేక్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థమే



అచ్చంపేటలో బాల్యవివాహాల నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చైల్డ్ డవలప్‌మెంట్ అడిషనల్ ప్రాజెక్టు అధికారి సరళ

అచ్చంపేట: బాల్య వివాహాల వల్ల అనర్థాలే ఎక్కువని, చిన్నతనంలో పెళ్లిళ్ల చేయడం నేరమని చైల్డ్ డవలప్‌మెంట్ అడిషనల్ ప్రాజెక్టు అధికారి బి.సరళ చెప్పారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు, కస్తూరిబా బాలికల పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె బాలికలను ఉద్దేశించి మాట్లాడారు. బాల్యవివాహాల నివారణ, లైంగిక వేధింపులు, అక్రమరవాణా, చిన్న వయస్సులో గర్భధారణ, బాలల హక్కుల పరిరక్షణ, గృహహింస తదితర విషయాలపై వివరించారు. బాలికలు దిశ యాప్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ముందుగా విద్యార్థులు ప్లకార్డులు చేతబూని అచ్చంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్, వై.శ్రీదేవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి




రమేష్‌కుమార్ మృతదేహం

మాదల(ముప్పాళ్ళ): అతి వేగంగా వస్తూ రోడ్డు మార్జిన్‌లో ఉన్న చప్టా దిమ్మెను కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దుర్ఘటన మాదల సమీపంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామానికి చెందిన మురుకుట్ల రమేష్‌కుమార్(68) కారులో నరసరావుపేట నుంచి సత్తెనపల్లి మండలం దూళిపాళ్ళలోని అత్తగారింటికి బయలుదేరాడు. మార్గమధ్యలో మాదల సమీపంలోని పెట్రోల్‌బంక్ దాటాక రోడ్డు పక్కన ఉన్న చప్టా దిమ్మెను కారు వేగంగా ఢీకొట్టి పొలాల్లోకి పల్టీ కొట్టింది. రమేష్‌కుమార్ కారులోంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కారు వేగానికి చప్టాదిమ్మె పూర్తిగా విరిగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. అటుగా వెళ్తున్న సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి బంధువులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.పట్టాభిరామయ్య తెలిపారు.

నిరుపయోగ వస్తువుల బహిరంగ వేలం

సత్తెనపల్లి: కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు మిషన్ శోభకృత్‌లో భాగంగా పురపాలక సంఘంలో నిరుపయోగంగా ఉన్న ఆటోలు మూడు, వస్తువులు, ఫర్నిచర్‌కు అధికారులు సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఆరుగురు వ్యాపారులు పాల్గొన్నారు. పాత ఇనుము కేజీకి రూ.35గా నిర్ణయించగా రూ.35.50 చొప్పున మంగళగిరికి చెందిన ఎస్.శ్రీనివాసరెడ్డి, ప్లాస్టిక్ కేజీకి రూ.16 నిర్ణయించగా రూ.17 చొప్పున మంగళగిరికి చెందిన ఎస్.శ్రీనివాసరెడ్డి హెచ్చు పాటపాడారు. ప్రింటర్ స్క్రాప్ కేజీకి రూ.4 నిర్ణయించగా సత్తెనపల్లికి చెందిన పి.ప్రభాకర్ రూ.5 చొప్పున, కంప్యూటర్ స్క్రాప్ కేజీకి రూ.30 నిర్ణయించగా రూ.35 చొప్పున సత్తెనపల్లికి చెందిన పి.ప్రభాకర్ హెచ్చు పాటపాడారు. పాత టైర్లు కేజీకి రూ.7 నిర్ణయించగా రూ.8 చొప్పున మంగళగిరికి చెందిన ఎస్.శ్రీనివాసరెడ్డి హెచ్చు పాటపాడారు. శానిటేషన్ విభాగంలో పాడైన పాత ఆటోలు ఒకటికి రూ.12 వేలు నిర్ణయించగా గుంటూరుకు చెందిన ఎస్టీ రహమాన్ రూ.12,100 చొప్పున హెచ్చు పాట పాడినట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తెలిపారు.

పిచ్చుక జాతి సంరక్షణతోనే మానవ మనుగడ



పిచ్చుక బొమ్మలు వేసిన విద్యార్థులతో హెచ్ఎం గురులింగం, ఉపాధ్యాయులు

నాదెండ్ల: సెల్‌ఫోన్ టవర్ల రేడియేషన్, వాయు, శబ్ద కాలుష్యాల కారణంగా పిచ్చుక జాతి అంతరించే ప్రమాదంలో పడిందని హెచ్ఎం ఎ.గురులింగం ఆవేదన వ్యక్తం చేశారు. గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో అవనిగడ్డ హుస్సేనమ్మ యల్లమందయ్య ట్రస్ట్, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. పంట ధాన్యాలు తినేస్తున్నాయన్న కారణంగా గతంలో చైనాలో పిచ్చుకల సంహారాన్ని పెద్ద ఎత్తున చేశారన్నారు. రెండేళ్ల కాలంలోనే చీడపీడల ఉధృతితో చైనాలో ఆహార ధాన్యాల దిగుబడి పతనమై ఆహార సంక్షోభం తలెత్తిందన్నారు. దీంతో నాటి నుంచి పిచ్చుకల పరిరక్షణకు చైనా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పిచ్చుక, ఇతర పక్షి జాతుల మనుగడతోనే మానవ మనుగడ ఆధారపడిందన్న విషయాన్ని మరిచిపోరాదన్నారు. వేసవిలో పిచ్చుకల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్లను ఏర్పాటు చేసి ధాన్యపు గింజలు ఉంచాలని కోరారు. అనంతరం విద్యార్థులు చిత్రించిన పిచ్చుకల బొమ్మలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశ్వరి శివకుమారి, వలంటీర్ మాణిక్యమ్మ పాల్గొన్నారు.

మంచికంటికి అభినందనలు



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన రిటైర్డ్ తెలుగు పండితుడు, ప్రముఖ ఆధ్యాత్మిక, సాహితీవేత్త మంచికంటి వేంకటేశ్వర రావు రాష్ట్ర ప్రభుత్వ ఉగాది సాహితీ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా సత్తెనపల్లి బ్రాహ్మణ ఐక్యవేదిక కార్యవర్గ సభ్యులు సోమవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలను తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు కలవకొలను శివరామకృష్ణ శాస్త్రి, పెద్దింటి ఫణి కృష్ణ, అంపిరాయని రాజశేఖర్, గుండవరపు అమర్‌నాథ్, కొండకావూరి మార్కండేయ శర్మ, రాష్ట్ర బాధ్యులు కోనంకి మారుతి, బెజగం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

23న వక్ఫ్ భూములకు కౌలు వేలం

నాదెండ్ల: గొరిజవోలు గ్రామ రెవెన్యూ పరిధిలోని షాహీ మసీదుకు చెందిన వక్ఫ్ భూములకు ఈ నెల 23వ తేదీ మూడేళ్ల కాలానికి గురువారం కౌలు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ కరిముల్లాబాషా తెలిపారు. మొత్తం 32 ఎకరాలకు సచివాలయంలో వేలం జరుగుతుందని పేర్కొన్నారు.

గ్రామ సచివాలయం అద్దాలు ధ్వంసం



పగిలిన గ్రామసచివాలయ భవనం అద్దం

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలెం గ్రామంలో ఇటీవలే ప్రారంభించిన కొత్త సచివాలయ భవనంపై దుండగులు రాళ్ళతో దాడి చేసి అద్దాలను పగలగొట్టారు. భవనానికి ముందు గోడపై ఉండే ముఖ్యమంత్రి ఫొటో పైనా రాళ్ళతో దాడిచేశారు. అది టైల్స్ కావటంతో కొద్దిపాటి పగుళ్ళు ఏర్పడ్డాయి. అయితే ఇది జనసేన కార్యకర్తల దుశ్చర్యేనని స్థానికులు అనుమానిస్తున్నారు. ఆదివారం సాయంత్రం సమీపంలోనే ఆ పార్టీ కార్యాలయాన్ని ప్రాంభించారు. అనంతరం ఆ పక్కనే ఉన్న ఖాళీస్థలంలో సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంలోనే కార్యకర్తలు ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని పేర్కొంటున్నారు. కొందరు యువకులు రాళ్లు విసిరారని, వద్దని కొందరు వారించినా పట్టించుకోలేదని సమాచారం. ఘటనపై పంచాయతీ కార్యదర్శి ముప్పాళ్ళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్సై ఎస్.కె.ఇమామ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

కాశీనగర్ 1947 సినిమా షూటింగ్



చిత్ర యూనిట్ సభ్యులు

అచ్చంపేట: శ్రీ గణేష్ దేవి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై మండలంలోని నీలేశ్వరపాలెం నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కాశీనగర్ 1947 సినిమా షూటింగ్ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తను అరెస్ట్ చేసే సన్నివేశాలను చిత్రీకరించారు. చిత్ర దర్శకులు జల్లు ప్రసాద్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చైతన్యం ప్రాధాన్యతతో, సెంటిమెంట్ పండించే సన్నివేశాలతో కూడిన ఈ చిత్రాన్ని కేవలం పల్లె వాతావరణంలో నిర్మిస్తున్నట్టు చెప్పారు. అచ్చంపేట, సత్తెనపల్లి, కంటెపూడి, ముప్పాళ్ల, దమ్మాలపాడు, బొల్లారం, మాదల తదితర గ్రామాలలోని ఆలయాల పరిసరాలలో చిత్రీకరణ చేసినట్టు వివరించారు. ప్రతినాయకుడు జగన్నాథపట్నాయక్‌గా ప్రజానాట్య మండలి, సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి వల్లం చెన్నకేశవనాయుడు నటిస్తున్నారని వెల్లడించారు. టీవీ నటులు కేవీఎల్ నరశింహారావు పూజారిగా, షేక్ సైదా పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా నటించారని తెలిపారు. నిర్మాతగా రాయదుర్గం రమాదేవిరెడ్డి, కెమెరామెన్‌గా జి.కృష్ణా, సంగీతం లక్ష్మణసాయి, పాటలు జి.సీతారామచౌదరి, ఎల్ఐసీ రఘుబాబు, కొరియాగ్రాఫర్‌గా బండ్లరామారావు, ఫైట్స్ హుస్సేన్‌భాయ్ వ్యవహరిస్తున్నట్టు పేర్కొన్నారు. చిత్రాన్ని సాధ్యమైనంత త్వరలో విడుదల చేస్తామని దర్శకుడు జల్లు ప్రసాద్ తెలిపారు.

పాఠశాలలకు స్టీలు గ్లాసులు వితరణ



ప్రీహైస్కూల్ హెచ్ఎం కృష్ణంరాజుకు స్టీలు గ్లాసులను అందజేస్తున్న దృశ్యం

అందుకూరు(క్రోసూరు): అందుకూరు గ్రామ సర్పంచ్ జంగా సౌభాగ్యలక్ష్మీనారాయణ సోమవారం గ్రామంలోని ప్రీహైస్కూల్, ఫౌండేషన్ పాఠశాలలకు 200 స్టీలు గ్లాసులు అందజేశారు. ఈసందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాగి మాల్ట్ మంగళవారం నుంచి పాఠశాలల్లో ప్రారంభమవుతున్నందున సర్పంచ్ విద్యార్థుల కోసం గ్లాసులు అందజేసినట్టు వివరించారు. సర్పంచ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అభినందించారు. సమాచారం తెలుసుకున్న డెప్యూటీ డీఈఓ వి.వెంకటేశ్వరరావు, ఎంఈఓ ఏసురత్నం పాఠశాలకు గ్లాసులు బహూకరించటం ఎంతో మంచి కార్యక్రమమని అభినందనలు తెలిపారు.